క్లుప్తంగా


కలియుగ వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫాల్గుణ మాసం శుద్ధ షష్టి శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చామర్తి శంకరశర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం రద్దీగా ఉండడంతో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి పల్టిమ రాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

'కోడ్' ఎఫెక్ట్



సంచార పశువైద్యశాలపై ఉన్న సీఎం జగన్ ఫొటోకు పేపర్ అతికిస్తున్న సిబ్బంది

మల్కాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలు పథకాలపై ఉన్న సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు తెలుపు పేపర్లు కప్పివేశారు.అలాగే పలు పార్టీల నాయకులు విగ్రహాలకు శనివారం ముసుగులు జీవీఎంసీ సిబ్బంది వేశారు. పారిశ్రామిక ప్రాంతంలో పలు ప్రాంతాల్లోని పలు పార్టీల కార్యాలయాల్లో ఉన్న చిత్రపటాలకు పేపర్లు అతికించారు.

27 నుంచి యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనరల్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్ర ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ ప్రత్యేక యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భాను కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 83743 57324లో సంప్రదించాలని సూచించారు.

పోర్ట్ పెన్షనర్ల ధర్నా రేపు

మల్కాపురం: పోర్టు ట్రస్ట్‌పై కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ ననపల బంగారురాజు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావుతో కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మురళీనగర్, తెన్నేటినగర్, మాధవధార, కంచరపాలెం తదితర ప్రాంతాల్లోని పింఛనుదారులను కలిసి కరపత్రాలు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్ రావు, కోశాధికారి అన్నపు నారాయణరావు, కె.గణేష్, పి.రామారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోపాలపట్నం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో శనివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఒకరికి చేతి వేళ్లకు, మరో వ్యక్తికి తలకు గాయాలయ్యాయి. దీంతో వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి వారిని తరలించారు. వీరి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు రాలేదని, ఎమ్మెల్సీ రిపోర్టు కూడా రాకపోవడంతో కేసు నమోదు చేయలేదు.

దారులిలా.. నడిచేదెలా?

- 59వ వార్డులో నేటికీ రాళ్లు తేలిన మట్టి రోడ్లే దిక్కు
- ఇబ్బంది పడుతున్న పాదచారులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు కొండ ప్రాంతంలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. 15 ఏళ్లకు పైగా కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఇటు వైపు అధికారులు కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రజలు రాళ్లు తేలిన, ఇరుకైన బాటల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి : జీవీఎంసీ 59వ వార్డులో గణపతినగర్, గంగానగర్,హిమాచల్‌నగర్,వాయుపుత్రకాలనీ వంటి కొండ ప్రాంతాలు ఉన్నాయి.ఆయా కాలనీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సుమారు 15 ఏళ్లకు పైగా ఉన్నా వీరు మొదట్లో ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారో నేడూ అదే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కొండ ప్రాంతాల్లో నివాసం ఉన్న వారు భారీ వర్షాలు వస్తే బిక్కు బిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి. ఆయా ప్రాంతాల్లో రక్షణగోడలు లేకపోవడంతో మట్టి చరియలు విరిగి దిగువన ఉన్న ఇళ్లపై పడి భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయి. గణపతినగర్ కొండ ప్రాంతంలో ఇప్పటికీ బీటీ రోడ్లు ఏర్పాటు చేయలేదు.బాటసారులు చూపిన బాట వలే ఇక్కడ మార్గాలు ఉన్నాయి.అలాంటి మార్గంలోనే ఇక్కడ నివాసీయులు రాకపోకలు సాగిస్తున్నారు. హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలోనూ రాళ్లు తేలిన మట్టి రోడ్డు ఇప్పటికీ దర్శనమిస్తోంది. సీసీ రోడ్డు వేయించాలని అధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నారు. అయినా స్పందన లేదు.ఇప్పటికైనా అధికారులు సమస్యలపై స్పందించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.



గణపతినగర్ కొండ ప్రాంతంలో స్థానికులు వినియోగిస్తున్న మట్టి రోడ్డు



హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో రాళ్లు తేలిన మట్టి దారి

సుధాకర్ గెలుపునకు సైనికుల్లా పనిచేయండి



నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా పార్టీ శ్రేణుల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆడారి మాట్లాడుతూ ప్రతి పట్టభద్రుడిని కలిసి వారి వివరాలు సేకరించాలని సూచించారు. బాగా పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వార్డు అధ్యక్షులు చురుగ్గా వ్యవహరించాలని కోరారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఇన్‌చార్జులు ఓటర్లను గుర్తించి వారితో మమేకమవ్వాలన్నారు. తొలి ప్రాధాన్యతా ఓటు సీతంరాజు సుధకార్‌కు వేసేలా సూచనలివ్వాలని చెప్పారు. ప్రతి ఓటర్‌కు కరపత్రాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గాదె శ్రీధర్‌రెడ్డి, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పి.వి.సురేష్, ముర్రు వాణి, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, పార్టీ వార్డు అధ్యక్షులు గులిగిండల కృష్ణారావు, భీశెట్టి గణేష్, ముక్క ప్రసాదరెడ్డి, దొడ్డి కిరణ్, అయితంశెట్టి గోపి, అప్పలస్వామి, దాడి సత్యనారాయణ, ఆళ్ల పైడిరాజు, నమ్మి శ్రీను, దొడ్డి సతీష్ పాల్గొన్నారు.

కారు డోర్ తగిలి వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: జ్ఞానాపురం నుంచి పోర్టు వైపు బైకుపై వెళ్తున్న ఒక వ్యక్తి గాయపడిన సంఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఎస్‌ఐ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. నేవల్ విభాగంలో పనిచేస్తున్న కాకానినగర్‌కు చెందిన రవి అనే వ్యక్తి శనివారం స్నేహితుడితో కలిసి బైకు మీద వెళ్తుండగా జ్ఞానాపురం సమీపంలో ప్రమాదం జరిగింది. అక్కడ ఆగి ఉన్న ఒక కారు డోర్‌ను హఠాత్తుగా తీయడంతో బైకుపై వెనుక కూర్చున్న రవి కాలుకు తగిలి గాయమైంది. చికిత్స కోసం అతడిని సీతమ్మధారలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి తండ్రి శ్రీవిష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న ధ్వజ స్తంభ స్వర్ణతాపడం పనుల్లో కదలిక

రూ.కోటితో పనులకు సీఎంఆర్ అధినేత సంసిద్ధత



ధ్వజస్తంభం వద్ద పరిశీలిస్తున్న సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం స్వర్ణతాపడం పనుల్లో కదలిక వచ్చింది. కోటి రూపాయల వ్యయంతో ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్ శనివారం సింహగిరికి వచ్చి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. ప్రస్తుతం రాగి రేకులతో ఉన్న ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు (రాగిరేకులపై బంగారుకోటింగ్ వేసేందుకు) గతేడాది సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ సంకల్పించారు. ఈమేరకు రూ.85లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎస్ఎఫ్‌టీకి 2.25గ్రాముల బంగారం వెచ్చించే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు. ఆ అంచనాలను రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌కి అప్పట్లో పంపించారు. మరింత ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా స్వర్ణమయం పనులు జరగాలని కమిషనర్ సూచించారు. దీంతో కోటి రూపాయలతో ధ్వజస్తంభం పనులు చేయాలని సీఎంఆర్ అధినేత ముందుకు వచ్చారు. దీంతో శనివారం సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం ఏఈ రాంబాబు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులతో కలిసి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. సంబంధిత ఎస్టిమేట్‌ను దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపించనున్నారు. అక్కడ నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

- అనధికార కట్టడాలపై తక్షణ చర్యలు
- సందేహాలపై జోనల్ కార్యాలయాన్ని సంప్రదించండి
- జోన్-5 టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమణమూర్తి



మాట్లాడుతున్న ఏసీపీ రమణమూర్తి

కంచరపాలెం: భవన నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జోన్-5 ఏసీపీ ఐ.వి.రమణమూర్తి తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలకు సంబంధించి పలు అంశాలను వెల్లడించారు. జోన్-5 పరిధిలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాలకు సంబంధించి ప్రతి నిర్మాణానికి అనుమతులు కచ్చితంగా ఉండాలన్నారు. ఆయా భవన నిర్మాణాలపై వార్డు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. అనుమతులు తీసుకోకుండా ఎవరైనా అనధికార నిర్మాణాలు చేపడితే వెంటనే టౌన్ ప్లానింగ్ టీపీవోల దృష్టికి సచివాలయ టీపీ కార్యదర్శులు తీసుకురావాలని ఆదేశించారు. లేని పక్షంలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి..

జోన్-5 పరిధిలో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఎవరైనా అనధికార నిర్మాణాలు చేపడితే తక్షణం ఆపేయాలని, లేనిపక్షంలో స్పెషల్ స్క్వాడ్ సిబ్బందితో వచ్చి తొలగిస్తామని హెచ్చరించారు.

సెట్‌బ్యాక్స్ వదలాల్సిందే..

అనుమతులు పొందిన భవన నిర్మాణదారులు తప్పనిసరిగా సెట్‌బ్యాక్స్ వదలి నిర్మాణాలు చేపట్టాలని రమణమూర్తి స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రహదారులను ఆక్రమించ కూడదని చెప్పారు. ఇంటి నిర్మాణాలతో ఇబ్బందులు ఉంటున్నాయని ఫిర్యాదులు అందిన వెంటనే పనులు నిలిపివేస్తామన్నారు. స్థానికులకు ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

బీపీఎస్‌కు త్వరలో అనుమతులు

భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ(బీపీఎస్) ప్రస్తుతం ఉత్తర్వులు రాలేదని జోన్-5 ఏసీపీ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చనే ఉద్దేశంతో నిర్మాణాలు చేపడితే అవి అనధికారిక కట్టడాలుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. భవన నిర్మాణదారులకు ఎటువంటి అనుమానాలు ఉన్నా.. ఆయా వార్డుల సచివాలయాల టౌన్ ప్లానింగ్ కార్యదర్శులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణ ప్లాన్‌కు సంబంధించి సందేహాలుంటే జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని ప్రజలను ఆయన కోరారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం



సుందరీకరణ పనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: వచ్చే నెలలో జరగనున్న రెండు అంతర్జాతీయ సదస్సులకు నగరంలో చేపడుతున్న సుందరీకరణ పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఎన్ఏడీ జంక్షన్ నుంచి మురళీనగర్, తాటిచెట్లపాలెం జంక్షన్ జాతీయ రహదారి వరకు అధికారులతో కలిసి పర్యటించారు. రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాలు తెలిపే సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రహదారికిరువైపులా పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలని, చెట్లు, ఎలక్ట్రికల్ పోల్స్, గోడలకు ఉన్న ప్రకటన బోర్డులు, కేబుల వైర్లు, పోస్టర్లు తొలగించి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించామన్నారు. బస్టాప్‌లు ఆధునీకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న మొక్కలకి ట్రై కలర్ వేయమని ఆదేశించారు. ప్రతిరోడ్డు క్రాసింగ్ వద్ద జీబ్రాలైన్స్ వేసి స్టడ్ లైటింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జీ-20 సదస్సుకు 20 దేశాల ప్రతినిధులు రానున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులను ఆయా ప్రాంతాల్లో ఉంచి, రోడ్డును నిరంతరం శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి బి. సురేష్‌కుమార్, హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు, ఆర్‌జీవీ కృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాలరావు, రామ్మోహనరావు, డీసీపీ సంజయ్, ఏసీపీ, ఏఎంహెచ్‌వో పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 28వ తేదీ తుది గడువు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ కలిస్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



క్రీడా మైదానం వద్ద డిగ్రీ స్టూడెంట్లతో మాట్లాడుతున్న బద్రీనాథ్, పీవీ సురేష్



సమావేశం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మల్కాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థుల విజయం కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఉన్నత చదువులు చదవి యువతను ఎక్కువగా ప్రసన్నం చేసుకుంటూ ఓటు అభ్యర్థిస్తున్నారు. దీనిలో భాగంగా 60వ వార్డు గుల్లలపాలెం.వాకింగ్ పార్కు వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న అభ్యర్థి సీతంరాజు సుధాకార్‌కు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని వార్డు కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి. సురేష్,ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్‌లు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బిల్డర్ సంతోష్ పాల్గొన్నారు.

- జీవీఎం 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ ముక్క వరలక్ష్మి, వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ ఆయా ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగిన వారి ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు ఇవ్వాలని కల్పించాలని అభ్యర్థించారు.
- జీవీఎంసీ 58వ వార్డు శాంతిగిరికాలనీ వద్ద బీజేపీ కార్యాలయంలో పార్టీ నగర నాయకులు పోలిమేర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యువతతో సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ నుంచి బరిలో ఉన్న మాధవ్‌కు మొదటి ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి



కార్పొరేటర్ లక్ష్మణరావును అభినందిస్తున్న నాయకులు

సింధియా: వార్డు ప్రజలకు సేవ చేయడంతోనే తనకు సంతృప్తి కలుగుతుందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. నిత్యం వార్డు పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన శైలిలో పని చేస్తున్న ఆయన వార్డు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు అంబేడ్కర్‌కాలనీ ప్రధాన రహదారి పక్కన శనివారం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నూతన కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ప్రతి రోజు ఉదయ 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు.

సాయిబాబా మందిరంలో పాము హల్‌చల్



సర్పాన్ని బంధిస్తున్న ఆనంద్

మల్కాపురం: స్థానిక సాయిబాబా మందిర ప్రాంగణంలోకి నాగు పాము చొరబడింది. దీంతో భక్తులు సర్పాన్ని చూసి భయంతో పరుగులు తీశా రు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో సాయిబాబా ఆలయం ప్రాంగణంలో పూజలు జరుగుతున్నాయి. అక్కడ భక్తులు పాదరక్షలు విడిచే ప్రదేశంలో పామును చూసిన భక్తులు పెద్ద కేకలు వేశారు. దీంతో ఆ సర్పం మందిరం మెట్ల మార్గం వైపు సాగింది. వెంటనే స్నేక్ క్యాచర్ ఆనంద్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి ఆ సర్పాన్ని గోనెలో బంధించి కొండ ప్రాంతంలో విడిచిపెట్టాడు. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

టెన్త్ పరీక్షలకు సన్నద్ధం కండి



విద్యార్థులకు సూచనలిస్తున్న కో ఆర్డినేటర్ ప్రసాద్

గోపాలపట్నం: పదో తరగతి పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మేహాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించి, తరగతుల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో విద్యా బోధన ఏవిధంగా జరుగుతుందో విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ఏవిధంగా ప్రిపేర్ కావాలో వివరించారు. తనలో ఉన్న బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించాలని అప్పుడే విజయం సాధిస్తామని చెప్పారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోషకాహార లోపాలు రక్తహీనత వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. మృదుల ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపాల్ బి. రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధి అజెండాలో భారత్ ప్రగతి



గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

అరిలోవ : వృద్ధి అజెండాలో భారతదేశం అగ్రగామిగా నిలవడానికి సిద్ధంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ఈఅండ్‌వై మేనేజింగ్ పార్ట్నర్ జయేష్ సంఘ్వీ తెలిపారు. నగరంలో ఓ హోటల్‌లో శనివారం జరిగిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సీఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచీకరణ, అవకాశాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణలు అనే అంశంపై మాట్లాడారు. డిజిటలైజేషన్ ఎకో సిస్టంను అందించిందన్నారు. దీంతో పాటు ఫార్మలైజేషన్ గవర్నెన్స్ సమస్యను పరిష్కరిస్తూ కొత్త వ్యాపార ఉత్పత్తుల సేవలను పెంపొందించిందన్నారు. దీనివల్ల సమర్థత, పోటీతత్వం పెరుగుతాయన్నారు. ఇది దేశంలో పెట్టుబడులను పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఉత్పత్తులు తయారీ, మౌలిక సదుపాయాల కల్పనలో భారతదేశం ముందుందన్నారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ డెలివరీ హెడ్ నల్లా సురేష్ మాట్లాడుతూ ఐటీ ల్యాండ్ స్కేప్‌లో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రాబ్లం సాల్వర్ నుంచి ప్రాబ్లం ఐడింటిఫైయర్ వరకు లోపం ఎక్కడ ఉందో అంచనా వేయలేకపోతున్నామన్నారు. ఇది పెద్ద సవాల్‌గా మారిందన్నారు.

సీఐఐ విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లు..

కాన్ఫెరెన్స్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లను ఈ సమావేశంలో నియమించారు. సీఐఐ 2023-24 నూతన చైర్మన్‌గా విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ పి.పి. లాల్‌ను నియమించారు. వైస్ చైర్మన్‌గా ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్ మేనేజింగ్ పార్టనర్ గ్రంధి రాజేష్‌తో పాటు మరికొందరు సభ్యులను నియమించారు.

పబ్లిక్ డిమాండ్

విద్యుత్ మీటర్‌కు పైకప్పు అమర్చండి..



విద్యుత్ మీటర్‌పై సరిగ్గా లేని పైకప్పు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ మైదానం పక్క విద్యుత్ స్తంభంపై ఉన్న మీటర్ పైకప్పు సరిగ్గా అమర్చలేదు. దీంతో దానిలో ఉన్న విద్యుత్ వైర్లు గాలిలో వేలాడుతున్నాయి. దీన్ని ఎవరైనా పట్టుకుంటే ప్రాణాలకు ముప్పు తప్పదు. ఇక్కడ ఈ వీధిలో ఎల్ఈడీ లైట్లు వెలిగించేందుకు, వాటి రీడింగ్ తీయడానికి వీలుగా మీటర్ తో పాటు దిగువ కటౌట్ పాయింట్ ఏర్పాటు చేశారు. సాయంత్రం పూట లైట్లు వెలిగించాలంటే కటౌట్ వైర్లు తగిలించి,పై కప్పును జాగ్రత్తగా అమర్చుతారు. కానీ పై కప్పు అమర్చకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు.దీని వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి.అధికారులు దీనిపై స్పందించాలి.